# సుందర ఆత్మ

అనువాదం : రంగనాథ రామ చంద్రరావు

డొమినికన్ రిపబ్లికన్ కథ -హ్యాన్ బోశ్

అప్పటికే నూటానాలుగు డిగ్రీల ఉష్ణోగ్రతకు పెరిగిన దోన్‌దమి అన్ శరీరం ప్రజ్ఞాశూన్య స్థితికి చేరుకుంది. అతని ఆత్మ విపరీతమైన పరితాపంలో మునిగింది. అప్పటికే కాలిపోతున్నట్టు దానికి అనిపించింది. దాంతో అది వేరుపడ సాగింది. అతని హృదయంలోంచి తనను తాను బయటికి లాక్కోసాగింది.

ఏ విధంగా 'ఆక్టోపస్' కు అసంఖ్యాకమైన పాదాలుంటాయో, అదే విధంగా 'ఆత్మ' కు లెక్కలేనన్ని అవయవాలుంటాయి. అందులో



కొన్ని రక్తనాళాల్లా వుంటాయి. మిగిలినవి చాలా చిన్నగా సూక్ష్మాతి సూక్ష్మమైన రక్తనాళాల్లా వుంటాయి. ఈ పాదాలన్నింటిని అది మెల్లమెల్లగా బయటికి లాగింది. పరిణామం గా దోన్‌దమిఆన్ శరీరం చల్లబడింది. దాంతో అతను బిగుసుకుపోసాగాడు. ముందుగా అతని చేతులు చల్లబడ్డాయి తరువాత భుజాలు, కాళ్ళు చల్లబడ్డాయి. అటు తరువాత ముఖం 'ప్రేతకళ' ను నింపుకోవటం మంచం చుట్టూ నుంచున్న వాళ్ళు గమనించారు. నర్స్ అలారం మ్రోగించి డాక్టర్ కోసం కబురు పెట్టింది. నర్స్ మాటలు విన్న 'ఆత్మ' తనలో తను యిలా అనుకుంది - "నేను వెంటనే వెళ్ళిపోవాలి. లేకుంటే నేను పూర్తిగా కాలి మాడి పోయే వరకు ఈ డాక్టర్ నన్ను యిక్కడే వుండేట్టు చేస్తాడు".

ఆత్మ గాలిలోకి లేచింది. ఇంటికప్పు మధ్యన వేలాడుతున్న బెహెమియన్ గ్లాస్ ల్యాంప్ వేపు సూటిగా ఎగిరింది. ల్యాంప్‌ను సమీపిస్తూ హఠాత్తుగా స్పృహలోకి వచ్చినట్టు తలతిప్పి కిందికి చూసింది.

అప్పుడప్పుడే తెల్లవారింది. ఓ కాంతి కిరణం కిటికీ నుంచి దూసుకొచ్చి "కొత్త రోజు" పుట్టుకను ప్రకటించింది. దోన్‌దమిఆన్ ఆత్మ బయటికి తొంగిచూసింది. చల్లగాలి మెల్లగా వీస్తోంది. ఆత్మ తనను హడావుడిగా బయటికి లాక్కుని వెలుతురును గమనిస్తూ, 'తప్పించుకు పోవటానికి యిదే మంచి అవకాశం' అని అనుకుంది. ఆలస్యం చేస్తే ఎవరైనా వచ్చి తనను గుర్తించి తన యజమాని శరీరంలో తనను మళ్ళీ ప్రవేశ పెడతారేమోనని భయంగా తనలోతనే అనుకుంది.

ఇలాంటి విషయాల్లో దోన్‌దమిఆన్ ఆత్మ వాట్టి అమాయకురాలనే చెప్పాలి. ఎందుకంటే ఒకసారి స్వాతంత్ర్యం పొంది,విముక్తి చెందిన ఆత్మ పూర్తిగా అదృశ్యమై పోతుందన్న సంగతి దానికి స్ఫురించనే లేదు.

రోగి ఖరీదైన మంచం చుట్టూ హడావుడిగా తిరుగుతున్న నర్సుల స్కర్టులు చేసే చప్పుళ్ళు ఆ గదిలో ప్రత్యేకంగా వినిపిస్తున్నాయి. ఆ గదిలో చేరిన జనాలు గుంపులు గుంపులుగా చేరి గుసగుసలు పోతున్నారు. తనున్న చెరలోంచి బయటపడి తప్పించుకు పోతున్న 'ఆత్మ' అక్కడి పరిస్థితినంతా గమనిస్తూనేవుంది. అదే సమయంలో ఓ నర్స్ హైపొడెర్మిక్ సిరెంజ్ పట్టుకుని ఆ గదిలోకి తిరిగొచ్చింది.

"భగవంతుడా! మా యజమానిని కాపాడు తండ్రీ" అంటూ కనిపించని దేవుల్ని ప్రార్థిస్తున్న ఆ యింటి ముసలి పనిమనిషి సిరెంజి పట్టుకుని వచ్చిన నర్సును చూడగానే - "అమ్మా, మరీ ఆలస్యం చేయకండమ్మా" అంటూ గోల పెట్టింది.

అయితే అప్పటికే బాగా ఆలస్యం అయింది. ఇలాంటి సీరియస్ సమయంలో నర్స్ చేతిలోని సూది దోన్‌దమిఆన్ భుజంలో గుచ్చుకుంది. సరిగ్గా అదేసమయంలో ఆత్మ తన చివరి అవయవాలను అతని నోటినుంచి బయటికి లాగేసింది. ఇంజెక్షన్ కూడా డబ్బు వ్యర్థం కావటాన్ని ప్రతిబింబించింది. కొద్ది సేపట్లోనే ఆ గదంతా ఏడ్పులతో, సందర్శకుల అడుగుల చప్పుళ్ళతో నిండిపోయింది. ఇంటి ముసలి పనిమనిషి బలవంతం మీద అన్నట్టు దోన్‌దమిఆన్ మంచం దగ్గర అతని భార్య, అతని అత్త ఏడ్వసాగారు.

ఆత్మ గాలిలోకి లేచింది. ఇంటికప్పు మధ్యన వేలాడుతున్న బెహెమియన్ గ్లాస్ ల్యాంప్ వేపు సూటిగా ఎగిరింది. ల్యాంప్‌ను సమీపిస్తూ హఠాత్తుగా స్పృహలోకి వచ్చినట్టు తల తిప్పి కిందకి చూసింది. అప్పుడు దోన్‌దమిఆన్ ముఖం కళాహీనమై పసుపురంగు లోకి తిరిగింది. అతని భవిష్యత్తు అప్పటికే నిర్ఫలమై బెహెమియన్ గ్లాసులో ప్రతిఫలి స్తోంది. అతని ముఖంలో నరాలు ఉబ్బిన ట్టుగా కనిపించ సాగాయి. అతని చర్మం కాంతిహీన మవుతూ 'ప్రేతకళ' ను పులుము కోసాగింది. ఇంటి ముసలిపనిమనిషి తన నెరిసిన తలను దుఃఖంతో కొంగులో దాచు కుంటూ వుండగా, అతని భార్య, అత్త, నర్సులు దిక్కుతోచనట్టు, ఏం చేయాలో అర్థంకానట్టు అతని చుట్టూ తిరుగుతున్నారు. అక్కడున్న ప్రతి ఒక్కరూ ఏమాలోచిస్తున్నారో, వాళ్ళల్లో ఎలాంటి భావాలు చెలరేగు తున్నాయో ఆత్మకు స్పష్టంగా తెలుస్తోంది. అయితే ఇదంతా గమనిస్తూ సమయాన్ని వ్యర్థం చేయడానికి దానికి మనస్కరించలేదు. ప్రతీక్షణానికీ ప్రకాశాన్ని పొందుతున్న వెలుతురు ఉజ్వలంగా మెరవసాగింది. తాను కర్టీ మీద కూర్చుని వుండటం గమనించి ఆత్మకు ఆశ్చర్యం వేసింది.

హఠాత్తుగా దోన్‌దమిఆన్ అత్త తన కూతురి చేయిపట్టుకుని బయట హాల్లోకి తీసుకెళ్ళి మెల్లగా అంది "తెలివి తక్కువగా ప్రవర్తించకు, కాస్త దుఃఖాన్ని బయటికి ప్రదర్శించు"

"అబ్బా ! రావలసిన వాళ్ళందరూ రానీ, అప్పుడు చూపిస్తా నా ప్రతాపం....." కూతురు గుసగుసగా అంది.

ఆత్మ వాళ్ళిద్దరి మాటల్ని వినసాగింది.

"ఉహూ ! ఇప్పుడే ఏడ్వాలి. నర్సు సంగతి మర్చిపోకు. ఆమె జరిగిందంతా అందరికీ చెబుతుంది"

కొత్త విధవ దోన్‌దమిఆన్ మంచం దగ్గరికి దుఃఖంతో పరుగుతీసింది -

"అయ్యో, దమి ఆన్, దమి ఆన్......' నీవు లేకుండా నేనెలా జీవించగలను" అంటూ గుండెలు బాదుకుంటూ ఏడ్వసాగింది.

జరుగుతున్నదంతా గమనిస్తున్న ఆత్మ ఆశ్చర్యంతో నోరు వెళ్ళబెట్టింది.

దోన్‌దమిఆన్ భార్య ఇంకా యవ్వనంలో వుంది. పెళ్ళినాటికే దోన్‌దమిఆన్ అరవై ఏళ్ళు దాటినవాడు. అతను ఆమెను మొదటిసారి చూసి, ఆమె గురించి తెలుసుకునే సమయానికి ఆమెకో ప్రేమికుడున్నాడు. రాజీపడలేని అనేక సందర్భాలను, తన యజమాని ఈర్ష్యను గుర్తుకు తెచ్చుకుని ఆత్మ నొచ్చుకుంది కొద్ది నెలల క్రితం జరిగిన సంఘటనను ఆత్మ గుర్తుకు తెచ్చుకుంది. ఆ రోజు దోన్‌దమిఆన్ భార్య భర్తతో - "నేను నా ప్రియుడ్ని చూడకుండా వుండలేను. నీవు దాన్ని ఆపలేవు. నేను నిన్ను పెళ్ళి చేసుకున్నది కేవలం నీ డబ్బు కోసమే అనే సంగతి నీకు బాగా తెలుసు" అని తెగేసి చెప్పింది, 'తన డబ్బుతో తాను సరియైనదాన్ని కొనలేక పోయానని'. దోన్‌దమిఆన్ వెటకారంగా సమాధానమిచ్చాడు. ఆ సంఘటన దోన్‌దమిఆన్ ను ఎంతో బాధించింది అలవాటు ప్రకారం దోన్‌దమిఆన్ అత్త భార్యభర్తల గొడవలో తలదూర్చింది. ఆ గొడవ చిలికి చిలికి గాలి వానగా మారబోతూ ముఖ్య అతిథుల రాకవల్ల ఆగిపోయింది. భార్యా భర్తలిద్దరూ ముఖాన నవ్వులు పులుముకొని వచ్చిన అతిథుల్ని సాదరంగా ఆహ్వానించారు.

బెహమియాన్ ల్యాంప్ దగ్గరున్న ఆత్మ ఈ సంఘటనలన్నీ గుర్తుకు తెచ్చుకుంటూ

> ఆత్మ తన నిజరూపం ముందు తన అస్తిత్వమేలేనట్టు ఫీలయ్యింది. ఒదిలేసిన దోన్‌దమిఆన్ శరీరంలోకి మళ్ళీ ప్రవేశించాలనుకుంది.

వుండగా ఫాదర్ చాలా దూరం నుంచి పరుగెత్తుకు వచ్చిన వాడిలా రొప్పుతూ లోపలికి అడుగు పెట్టాడు. ఆ సమయంలో అతనెందుకొచ్చాడో ఎవరూ వూహించలేకపోయారు. సాధారణంగా ఈ ఫాదర్ జబ్బు మనిషిని రాత్రి పూట మాత్రమే కలిసే వాడు. 'పాపక్షమాపణ' కార్యక్రమంలో భాగం వహించేవాడు.

"నాకు ముందుగానే 'సూచన' వచ్చింది. దోన్‌దమిఆన్ పాపాలను పరిహారం చేసుకోకుండా వెళ్ళి పోవటం నాకు ఆశ్చర్యంగా వుంది' ' అన్నాడు.

అత్త అనుమానంగా అతని వేపు చూస్తూ అడిగింది - "అంటే నిన్న రాత్రి మా అల్లుడు గారు పాపాలను విన్నవించుకో లేదా ఫాదర్?'

ఆమె ఆ విషయాన్ని ప్రత్యేకించి అడగటానికి కారణం గడిచిన రోజు రాత్రి గదితలుపులు మూసుకొని దోన్‌దమిఆన్ తో ఫాదర్ సుమారు ఒక గంట సేపు మాట్లాడు తూ వుండిపోయాడు. జబ్బు మనిషి తన పాపాలను విన్నవించుకుంటున్నాడని యింటి వాళ్ళు భావించారు. అయితే జరిగింది వేరు. ఆత్మకు ఆ విషయం తెలుసు. ఈ సమయం కాని సమయంలో ఫాదర్ ఎందుకొచ్చాడో కూడా ఆత్మకు అర్థమయ్యింది

ఆ ఊళ్లో ఒక చర్చీ నిర్మాణానికి గాను దోన్‌దమిఆన్ నుంచి అధికమొత్తంలో చందా ఆశించాడు ఫాదర్. అయతే దోన్‌దమిఆన్ అభిప్రాయం మరొలా వుంది. ఫాదర్ అడిగిన సొమ్ము కంటే ఎక్కువ సొమ్ముతో ఒక ఆస్పత్రి నిర్మించాలని అతను ఆశించాడు. ఆ కారణంగా ఫాదర్ కోరికకు సుముఖంగా సమాధానం యివ్వలేదు. దాంతో ఫాదర్ వెళ్ళిపోయాడు. ఇల్లు చేరుకున్నాక గాని ఫాదర్‌కు తను గడియారం పోగొట్టుకున్న విషయం తెలియలేదు.

ఆత్మ తన కొత్త చైతన్యంలో మునిగింది, ఇప్పుడది సర్వస్వతంత్రురాలు. తను వెళ్ళని, చూడని స్థలాల్లో జరిగే విషయాలు సైతం దానికి తెలిసిపోతున్నాయి. దేవుడి గురించి ప్రజలు ఏమాలోచిస్తారు, దేవుడి నుండి ఏమాశిస్తారో కూడా అది తెలుసుకుంది. ఫాదర్ తనలో తను "నేను నా వాచ్‌ను దోన్‌దమిఆన్ ఇంట్లో వొదిలిపెట్టాను. టైము చూస్తూ అక్కడ పెట్టేశాను అని అనుకోవటం దానికి తెలిసిపోయింది. అతని రాక భగవద్కార్య నిమిత్తం కాదని, స్వార్థపూరితమైనదని గ్రహించింది.

"లేదు, ఈయన పాపాలను విన్నవించుకోలేదు" ఫాదర్ దోన్‌దమి ఆన్ అత్తగార్ని సూటిగా చూస్తూ మళ్ళీ తన మాటల్ని కొనసాగించాడు' ' - నిన్నరాత్రి మేము ఆ విషయాల గురించే మాట్లాడుకోలేదు. ఆ కారణంగానే నేను తెల్లవారు జామున రావాలని నిర్ణయించుకున్నాను. పాపాల క్షమాపణకు,. బహుశా....... చివరి విధులను పూర్తి చేయటానికి కూడాను దురదృష్టవశాత్తు నేను చాలా ఆలస్యంగా వచ్చినట్టున్నాను" అని ఫాదర్ గంభీరంగా అంటున్నా అతని కళ్ళు మాత్రం రోగి మంచం ప్రక్కన వున్న బల్లమీది వస్తువులలో వాచ్ కోసం ఆత్రంగా వెదికాయి.

దోన్‌దమిఆన్ సేవలో నలభైఏళ్ళకు పైగా కాలం గడిపిన ముసలి పనిమనిషి కన్నీరు కారుస్తూ తలపై కెత్తి పైకి చూస్తూ అంది - "ఇది ఎలాంటి మార్పును తేలేదు. ఇలా అంటున్నందుకు భగవంతుడు నన్ను క్షమించాలి. మా యజమాని ఉత్తముడు, మా యజమాని అత్యంత 'సుందరమైన' ఆత్మను కలిగివున్నాడు. ఆయనకు పాపాలను విన్నవించుకోవాల్సిన అవసరమే లేదు. దోన్‌దమిఆన్ చాలా అందమైన 'ఆత్మ' ను పొందినవాడు".

ఆ మాటలను విన్న ఆత్మ తెల్లబోయింది. ఆత్మ తాను అందంగా వుండటాన్ని ఎన్నడూ కలలోనూ చూసుకోలేదు. దాని యజమాని బ్రతికున్న రోజుల్లో ఎన్నో మంచి పనులు చేశాడు. 'మంచివాడు' అనటానికి ఉదాహరణంగా వుండేవాడు. చక్కటి దుస్తులు తొడుక్కుని నీటుగా వుండేవాడు. బ్యాంకు వ్యవహారాల్లో ఎంతో తెలివిగా ప్రవర్తించేవాడు. తాను అందంగా వుందో లేక అందవికారంగా వుందో చూసుకోవటానికి అతని ఆత్మకు సమయమే వుండేది కాదు. ఆత్మకు ఓ సంఘటన గుర్తొచ్చింది. దాని యజమాని లాయర్ ఎక్కడా నివసించడానికి ఇల్లు లేక ప్రత్యర్థి యింటినే స్వాధీనం చేసుకోవటానికి ప్రయత్నించాడు. అందుకు యజమాని కూడా సమర్థించాడు. ఇలా వుండగా ఓ సారి అతను క్రింది వర్గానికి చెందిన వయస్సులో వున్న ఓ అందమైన అమ్మాయిని తన ఆధీనంలో వున్న అపార్ట్‌మెంట్‌లో ఏకాంతంగా కలవాలని కోరుకున్నాడు. అలాంటప్పుడు అతని ఆత్మ అందమైనదో లేదా అందవికారమైందో ?....

తన యజమాని అవయవాల నుంచి తనను వేరు పరుచుకుని కేవలం కొద్ది క్షణాలు మాత్రమే గడపటం వల్ల ఆత్మకు ఇదంతా కొంతవరకు తెలుసు. అంతేకాకుండా ఇదంతా వూహించుకోడానికి కొద్ది సమయమే మిగిలింది. ఎందుకంటే అంతా తొందరతొందరగా గందరగోళంగా జరిగిపోయింది. దోన్ దమిఆన్ ను చూడటానికి మధ్యరాత్రి వచ్చిన డాక్టర్ తిరిగి వెళ్ళేటప్పుడు - "పరిస్థితికాస్త ఆందోళనకరంగా నే వుంది. తెల్లవారుజామున కాస్త తీవ్రం కావచ్చు. అలా ఏమైనా జరిగితే వీరిని జాగ్రత్తగా చూసుకోండి ఏమైనా అయితే నాకు చెప్పి పంపండి" అన్నారు.

"చావు వచ్చి తాను కాలిపోయేంతవరకు ఆత్మ తనను అంటిపెట్టుకునే వుంటుందా ? దాని చేతనాబిందువు (దానికి అదే సరియైన పదమైతే) దోన్‌దమిఆన్ అణువణువును ఆవరించుకుని వుంటుంది. వెలుతురుకాంతిని ప్రసరింపజేస్తుంది. అంతేకాకుండా ఇది ఇతని శరీరంలో స్ప్రై జేసిన చికెన్ అరిగిపోయేవరకు వుంటుంది. అయితే ఇది వేరుపడి నిజంగా ఎంత సమయమైంది ? కొంచెంసేపే. ఖచ్చితంగా యిప్పటికీ దానికి వేడిమి తగులుతోంది. పై నుంచి వస్తున్న గాలి చల్లదనానికి బదులుగా, తన యజమాని లోనూ, మరియు బొహిమియన్ గ్లాసు ల్యాంప్ మధ్యవున్న వాతావరణపు మార్పు చాలా స్వల్పమని ఆత్మ నిర్ధారించింది. ఇది మారివుండ... లేదా మారి వుండకపోని, యింటి ముసలి పనిమనిషి వెలిబుచ్చిన అభిప్రాయానికి సమాధాన

మేమివ్వాలి. ఆమె తన యజమాని ఆత్మను 'సుందర' మైన ఆత్మగా ప్రకటించింది ఆమె తన యజమానిని ఆత్మసాక్షిగా అభిమానిస్తున్న విశ్వాసపాత్రురాలైన స్త్రీ. ఆమె అతన్ని ఎంతగానో ప్రేమించేది. అందుకు అతను శ్రీమంతుడు కావటం కానీ, ఉదారుడు కావటం కానీ ముఖ్య కారణాలు కావు.

"ఈయన అంత సుందర ఆత్మను ఎందుకు పొందాడు" ? ఫాదర్ అడిగాడు.

"దీన్ని 'సుందరం' అని విడమరిచి చెప్పడానికి సాధ్యం కాదు" అత్త గట్టిగా అంది.

ఆత్మ ఆమె వేపు తిరిగి చూసింది. అదే సమయంలో ఆమె తన కూతురికి కనుసైగ చేయటం ఆత్మ గమనించింది. ఆ కనుసైగ భావాన్ని ఆత్మ అర క్షణంలో గుర్తించింది. ఆ కనుసైగలో ఆజ్ఞా, గద్దింపు రెండూ కలగలసి "మళ్ళీ ఏడుపు మొదలుపెట్టే మొద్దుముఖమా ! నీ భర్త మరణం నీకు సంతోషం కలిగిస్తున్నట్టు మొహం పెట్టకు. ఫాదర్‌కు అనుమానం కలిగేట్టు ప్రవర్తించకు ?" అన్న భావం యిమిడి వుంది.

తల్లి సైగను కూతురు అర్థం చేసుకుంది. వెంటనే కన్నీరు కారుస్తూ నోరువిప్పింది.

"ఇలాంటి సుందరమైన ఆత్మను ఎవరూ కలిగివుండరు. దమిఆన్ ! నేను నిన్నెంతగా ప్రేమించేదాన్ని అయ్యో........"

ఆత్మకు చాలాసేపు అక్కడ వుండటానికి సాధ్యం కాలేదు. మరో అవకాశాన్ని పోగొట్టుకోకుండా నిజంగానే తను సుందరంగా ఉందో లేదో తెలుసుకోవాలనుకుంది....... అది ఈ ఆషాఢభూతులనుంచి దూరంగా పోవాలనుకుంది. నిలువుటద్దం వున్న బాత్ రూం వేపు కదిలింది. 'అదృశ్యం' కావటం తెలియనట్టే దానికి తాను బరువు లేకపోవటం కూడా తెలియదు. తనను ఎవరూ గమనించ లేదని దానికి సంతోషం వేసింది. గబగబా వెళ్ళి అద్దముందు నుంచుంది.

అయితే పాపం దానికి అద్దంలో కనిపించిందేమిటి ?

అరవై ఏళ్ళనుంచి దోన్‌దమిఆన్ తన కళ్ళుతో చూస్తూ వచ్చిన ఆ కళ్ళు నేలకు ఐదడుగుల ఎత్తులో వుండేవి. అంతేకాకుండా తన ఒకప్పటి జీవింతమైన ముఖాన్ని మరోలా చూస్తోంది. అతని కళ్ళను మెరుస్తున్న అతని తెల్లని జుట్టును, అహంభారంతో విరుచుకున్న రొమ్మును, గర్వంతో పైకెత్తిన తలను, అతను ధరించే ఖరీదైన దుస్తుల్ని అది చూడటం లేదు. ఇప్పుడది పొడుగ్గా, మొరటుగా వున్న ఒక కొత్త చిత్రాన్ని చూస్తోంది. ఈ చిత్రం మసక బారిపోయింది స్పష్టమైన ఆకారంగా లేదది. దోన్‌దమిఆన్ శరీరానికి కేవలం కాళ్ళూ పాదాలు వుంటే ఏలావుంటుందో ఆ చిత్రం అలా వుంది. వికృతంగా యున్న ఓ అవయవాల 'గుత్తి' లా వుంది. ఆక్టోపస్‌లా వుంది. అంటే వికారంగా వుంది. కొన్ని అవయవాలు అన్నిటికన్నా చిన్నగా వున్నాయి. కొన్ని మరీ చిట్టిగా వున్నాయి. అంతేకాకుండా అవన్నీ పొగతో చేసినట్టుగా కనిపిస్తున్నాయి. కొన్ని కేశ పరిమాణంలో సూక్ష్మంగా కనీకనిపించినట్టుగా వున్నాయి. కొన్ని వొదులుగా వున్నాయి. మరి కొన్ని వేలాడబడినట్టుగా వున్నాయి. శక్తి లేనట్టుగా వున్నాయి. అత్యంత వికృతంగా వున్నాయి.

దోన్‌దమిఆన్ ఆత్మ తన ప్రతిబింబాన్ని అద్దంలో చూసుకొని దబ్బుమని క్రింద పడింది. అయినా పైకి చూడాలని ధైర్యం తెచ్చుకుని లేచింది. దానికి నడుము కనిపించలేదు. వాస్తవానికి దానికి కంఠం లేదు. మెడ లేదు, గొంతు లేదు. అసలేమీ లేవు. ఎక్కడైతే అవయవాలన్నీ కలుసుకొని వున్నాయో అక్కడ చెవిలా వున్న అవయవమొకటి బయటికి బారచాచుకుని వుంది. ఒక వేపు ఎండిన ఆపిల్ పండు తొక్కలా కనిపిస్తూ, మరో ప్రక్క గుబురుగా పెరిగిన పొదల్లా, మొదట్లో కేశాల్లా వున్నాయి. కొన్ని వుంగరాల్లు చుట్టుకుని వున్నాయి. కొన్ని నిటారుగా వున్నాయి. ఆరిపోయిన దీపం మసకబారినట్టు ఇది అసహ్యంగా కనిపిస్తోంది. అన్నిటికంటే అసహ్యంగా - ఎండిన పండులో కొరికితే ఏర్పడిన గూడులాదాని నోరు బోలుగా చాలా వికృతంగా మరీ అసహ్యంగా, కనిపిస్తోంది. అంతేకాకుండా ఆ గూడులోతుల్లో ఒక కన్ను కనిపిస్తోంది. దానికున్న ఒకేఒక కన్ను, బాహ్యరూపాల్ని ప్రదర్శిస్తూ భయంకరంగా, విశ్వాసఘాతుకంగా మెరుస్తోందా ఒంటికన్ను!

ఆడవాళ్ళు, ఫాదర్ యింకా పక్కగదిలోనే వున్నారు. దోన్‌దమిఆన్ శవం పడివున్న మంచం చుట్టూ నుంచోని అతను సుందర ఆత్మను కలిగివున్నాడని చెబుతూనే వున్నారు.


"నేనిలా కనిపిస్తూ వీధిలోకి ఎలా వెళ్ళాలి ?" అని ఆత్మ తనను తనే ప్రశ్నించుకుంది. చీకటి సొరంగంలో చిక్కుబడిపోయినట్టు దారి కోసం అటుయిటూ చూస్తూ. అంతలో కాలింగ్‌బెల్ మోగింది. అది వినగానే "డాక్టర్ వచ్చినట్టున్నారు, ఆయన్ను పిలుచుకొస్తాను'' అంటూ నర్స్ బయటికి వెళ్ళింది.

ఆ మాటలు వినగానేదోన్‌దమి ఆన్ భార్య గొంతెత్తి బిగ్గరగా ఏడ్వసాగింది. తనను ఒంటరిదాన్ని చేసి వెళ్ళిపోయినందుకు భర్త నిర్దయతను ఆడిపోసుకుంటూ, అదేవిషయాన్ని భర్తకు మొరపెట్టుకుంటూ ఏవేవో అంటూ గొల్లుగొల్లుమని ఏడుస్తూ బుడిబుడి రాగాలు తీయసాగింది.

ఆత్మ తన నిజరూపం ముందు తన అస్తిత్వమేలేనట్టు ఫీలయ్యింది. ఒదిలేసిన దోన్‌దమిఆన్ శరీరం లోకి మళ్ళీ ప్రవేశించాలనుకుంది.

ఆత్మ దోన్‌దమిఆన్ శవం వున్న గదిలోకి తిరిగి చూసింది. ఆడవాళ్ళు మంచం చుట్టూ నుంచోనున్నారు. ఫాదర్ ప్రార్థన చేస్తూవున్నాడు ఆత్మ తనకు వారికి మధ్య దూరాన్ని కొలిచింది. తనకు కొత్తగా లభించిన శక్తితో గాలిలోకి లేచింది. దోన్‌దమిఆన్ తలవేపుకు వెళ్ళి చప్పుడు చేయకుండా, కదలకుండా నుంచుంది. దోన్‌దమిఆన్ నోరు యింకా తెరుచుకునే వుంది. మంచులా చల్లగా వుంది. అయితే అదే ముఖ్యం కాదు. ఆత్మ లోపలికి ప్రవేశించి తన అవయవాలను వాటి యథాస్థానాల వేపు మరల్చింది.

అది సంపూర్ణంగా శరీరంలో కూడుకుం



టున్నప్పుడే డాక్టర్ అత్తతో - "దయచేసి కాసేపు నిశ్శబ్దంగా వుండండి" అని అన్నారు.

ఆత్మ అప్పటివరకూ డాక్టరును చూస్తూనే వుంది. అయితే అదే సమయంలో డాక్టరుగారు దోన్‌దమిఅన్ ను సమీపించారు. అతని చేయి పట్టుకుని పల్స్ చూడసాగారు. చూస్తూ చూస్తుండగానే ఆయన ముఖంలో ఆశ్చర్యం చోటు చేసుకుంది. వెంటనే తన చెవిని దోన్ దమిఅన్ గుండెలపై వుంచి ఓ నిముషం పాటు వినటానికి ప్రయత్నించాడు. అతరువాత తన బ్యాగు తెరిచి స్టెతస్కోప్ బయటికి తీశారు. ఏదో ఆలోచిస్తూ స్టెతస్కోప్ చివర్లని చెవిలో పెట్టుకున్నారు. దాని మరో చివరను దోన్‌దమిఅన్ గుండె మీద పెట్టారు. మరుక్షణం ఆశ్చర్యపోతూ స్టెతస్కోప్ తీసి ప్రక్కన పెట్టి హైపోడెర్మిక్ సిరెంజ్‌ను తీసి నర్స్‌కు యిచ్చి సిరెంజ్ లోడ్ చేయమన్నారు. ఆ తరువాత చిన్న రబ్బరు ట్యూబును తీసి దోన్‌దమిఅన్ ముంజేతి పై భాగాన గట్టిగా చుట్టారు. ఒక ఇంద్రజాలికుడు తన ఇంద్రజాలిత విద్యలను గాలిలో ప్రదర్శిస్తున్నట్టు ఆయన తన పనిలో మునిగాడు. ఆయన చేస్తున్నదేమిటో అర్థం కాక ఇంటి ముసలి పనిమనిషి - "ఆయన చనిపోయాక ఇదంతా మీరెందుకు చేస్తున్నట్టు ?" అని అడిగింది.

డాక్టర్ సీరియస్‌గా ఆమెను కోప్పడ్డాడు. అలా కోప్పడం ఆమెకు మాత్రమే కాక అక్కడున్న వారందరికి అన్వయించేట్టుగా వుంది.

"డిస్టర్బ్ చేయకు. నా ప్రయత్నమంతా దోన్‌దమిఅన్ ను బ్రతికించడానికే. ఆత్మలు అందంగా ఎక్కుడుంటాయో చూడటానికి మీకు సాధ్యం కాదు. అయితే నేను చేయాల్సిన ప్రతీ ప్రయత్నం చేస్తాను. అంత వరకూ ఇతడ్ని చావనీయను" అన్నాడు డాక్టర్.

ప్రశాంతంగా, నెమ్మదిగా, స్పష్టంగా గంభీరంగా వున్న డాక్టరుగారి మాటలు దోన్ దమి అన్ భార్యను ఖిన్నురాల్ని చేసింది. ఆమె కళ్ళు కాంతిని కోల్పోయి ఆమె ముఖం రక్తం లేనట్టు తెల్లగా పాలిపోయింది. సన్నగా వొణుకుతున్న కంఠంతో - "అంటే......అంటే..... అయనింకా చావలేదా" అంది.

ఆత్మ అప్పటికే తన శరీరంలోకి ప్రవేశించింది. మూడు అవయవాలు మాత్రం తాము మూడేళ్ళుగా నివసించిన పాత స్థలాల్లో చోటు చేసుకోవటానికై తడుముకుంటున్నాడు.

డాక్టర్ దోన్‌దమిఅన్ భార్య అడిగిన ప్రశ్నకు సమాధానం చెప్పలేదు. దోన్ దమి అన్ ముంజేతిని పట్టుకుని తన చేత్తో రుద్ది వేడి పట్టించాడు. ఆత్మకు తన చుట్టూ జీవితపు చైతన్యం గోచరించింది. అదే సమయంలో అది తన చివరిభాగాలను శరీరంలో జోడించుకుంది. సరిగ్గా అప్పుడే చేతిలో వ్యాపించిన రక్తనాళానికి డాక్టర్ సూదిని గుచ్చారు. మోచేతిపై చుట్టిన పట్టీని తీశారు. కొంచెం కొంచెంగా, మెల్లిమెల్లిగా అలలు అలలుగా దోన్ దమి అన్ చర్మంలో జీవితపు చైతన్యం చోటు చేసుకోసాగింది.

"అద్భుతం!" ఫాదర్ గొణిగారు.హఠాత్తుగా తన భారీ కల్పనలోంచి బయటపడ్డాడు. కొత్త చర్చికి చందా ఖచ్చితంగా దొరుకుతుంది. ఇప్పుడు చచ్చినవాడ్ని తన ప్రార్థనతో ఎలా తిరిగి బ్రతికించాడో అందరికి చెప్పొచ్చు. అతని కోసమే తను ప్రార్థన చేసినట్టు ప్రచారం చేయొచ్చు. - "దేవుడు నన్ను అడిగిన తరువాతే నిన్ను మళ్ళీ బ్రతికించాడు" అని దోన్‌దమి అన్ తో చెప్పొచ్చు. అప్పుడు అతను చందా యివ్వకుండా వుండగలడా ? అని అనుకున్నాడు ఫాదర్. తల ఖాళీఅయినట్టు అనిపించింది. ఉద్వేగంతో భర్త ముఖాన్ని తీక్షణంగా చూసి తలతిప్పి తల్లి వేపు "ఏం చేయాలిప్పుడు" అన్నట్టు చూసింది. వాళ్ళిద్దరూ ఏక్షణంలోనైనా మూర్ఛపోయేట్టున్నారు. అప్పటికే యిద్దరూ ఆశ్చర్యంతో మాటలు రాని మూగవారయ్యారు.

డాక్టర్ ముఖం సంతోషంతో విప్పారింది. తనలో తను ఎంతో సంతృప్తి చెందాడు. అయినా దాన్ని బయటికి ప్రదర్శించలేదు.

"గండం గడిచింది. మాయజమానిని మీరు రక్షించారు" యింటి పనిమనిషి సంతోషంతో గట్టిగా ఏడ్చింది. ఆ దేవుడికి మీకు నా నమస్కారాలు" అని రోదిస్తూ డాక్టరుగారి చేతిని ఆర్తిగా పట్టుకుంది.

"ఈయనకు ప్రమాదం తప్పించి, ఈయన మళ్ళీ బ్రతికాడు. మీరు చేసిన సహాయానికి వెలకట్టి దోన్‌దమిఅన్ మీకు యివ్వలేడు" అందామె.

దోన్‌దమి అన్ తనకు యివ్వదలచుకున్న ఎక్కువ డబ్బు వున్నవాడని డాక్టరు మనసులో అనుకున్నాడు. అయితే పైకి మాత్రం యిలా అన్నాడు - "ఇతని దగ్గర ఒక్క పెన్నీ లేకపోయినా నేను నా ప్రయత్నాన్ని మానుకునేవాడ్ని కాను. ఇది నా కర్తవ్యం - సమాజం పట్ల నాకున్న బాధ్యత. ఇలాంటి సుందర ఆత్మను కలిగినవాడ్ని తప్పకుండా రక్షించేవాడ్ని'

ఆ మాటల్ని ఆయన ముసలిదానితో చెప్పినా అది అందరికి వర్తిస్తుంది.

దోన్‌దమిఅన్ ఆత్మ అలసటతో నిద్రపోవటానికి నిర్ణయించుకుంది. ఓ క్షణం తరువాత దోన్‌దమిఅన్ మెల్లగా ఊపిరి పీల్చాడు. తలను నెమ్మదిగా కదిలించాడు.

"వీరిప్పుడు బాగా నిద్రపోతారు. వీరికి పూర్తి విశ్రాంతి అవసరం" అంటూ డాక్టర్ గారు తమ మాటకు కట్టుబడినట్టు ఆ గది నుంచి బయటికి నడిచారు.

